క్లుప్తంగా

వైవీయూలో పలు విభాగాల తనిఖీ



అధ్యాపకులకు సూచనలు ఇస్తున్న కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ

కడప ఎడ్యుకేషన్: వైవీయూలో పలు విభాగాలను బుధవారం కళాశాల ప్రిన్సిపల్ ఎస్ రఘునాథ్ రెడ్డి , కులసచివులు పి. పద్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ట్స్ బ్లాక్ లోని అన్ని విభాగాలను పరిశీలించారు. తరగతి గదిలో పాఠ్యాంశాల బోధన తీరును గమనించారు. ఇటీవలే నూతనంగా ఏడాది వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులో చేరిన విద్యార్థుల తరగతులు, వసతులపై ఆరా తీశారు. అనంతరం ఇంజనీరింగ్ విభాగాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీరి వెంట ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ పి సరిత పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవరచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఓబులేసు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవరచుకోవాలని కడప చిన్నచౌకు పోలీసు స్టేషన్ సీఐ ఓబులేసు అన్నారు. బుధవారం కడప జయనగర్ కాలనీ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే బాగా చదువుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. బాగా చదువుకుని అటు సమాజానికి, ఇటు దేశానికి సేవ చేయాలని అన్నారు. అలాగే తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్ – 100, రహదారి భద్రత, సోషల్ మీడియా – సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజరాజేశ్వరెడ్డి, పోలీసు సిబ్బంది, హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు ప్రమోషన్లు కల్పించాలి



డీయం అండ్ హెచ్ఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉమ్మడి కడప జిల్లాలో (గ్రేడ్ 3 ఏఎన్ఎం) ఎంపీహెచ్ఎఫ్ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ఫిమేల్ ఖాళీగా ఉన్నాయని, 144 పోస్టులకు సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎం లకు సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సచివాలయ రెండవ ఏఎన్ఎం లతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 144 మందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జరుపుతున్న కౌన్సిలింగ్ ను తక్షణమే నిలుపదల చేసి, మెరిట్ ప్రాతిపదికన కాకుండా సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సిలింగ్ నిర్వహించేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా, నగర అధ్యక్ష కార్యదర్శులు పి. సుబ్బరాయుడు, జీ.మద్దిలేటి, జిల్లా నాయకులు పీ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



రిమ్స్‌లో అన్నదానం చేస్తున్న విశ్వనాథ సేవా సమితి సభ్యులు

కడప అర్బన్: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం కడప నగర శివార్లలోని రిమ్స్ ఆవరణంలో శ్రీకాశీ విశ్వనాథసేవా సమితి అధ్యక్షులు రెడ్డి లక్ష్మణ్ సహకారంతో చికిత్స కోసం వచ్చే వారి కుటుంబ సభ్యులకు 200 మందికి అన్నదానం చేశారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో రెడ్డి లక్ష్మణ్‌తో పాటు, ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, గుండ్లకొండ విజయలక్ష్మి, పుట్టా పురుషోత్తం, వెంకటసురేష్‌బాబు, ఎలక్ట్రిషియన్ మధు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో విశేష పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ



ఆలయ ఆవరణలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : శ్రీ విజయదుర్గాదేవి ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండవ రోజు మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం తెల్లవారు జామున 4.30 గంటలకు అమ్మవారికి పవిత్ర నదీ జలాలు నింపిన తొమ్మిది కళాశాలలోని నీటితో నవకలశస్నపనం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని కనుల పండువగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు యాగశాలలో చండీహోమం, అనంతరం ఆలయ మండపంలో శ్రీచక్రార్చన నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆలయ మండపంలో శ్రీ విజయదుర్గ మల్లికార్జున స్వామిలకు 108 మంది ముత్తైదువులు 108 దీపాలను వెలిగించి దీపాలంకరణ సేవ నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్లు వ్యాఘ్ర (పులి)వాహనంపై కొలువుదీరి ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీ వాసుల బృందం, మహిళలు చేసిన కోలాటం ఆకట్టుకుంది. పూజలనంతరం భక్తులందరికీ ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జున రావు, ఆలయ నిర్వాహకులు సుధా దుర్గాప్రసాద్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేస్తున్నారు.

వైభవంగా సత్యదేవుని వ్రతం



పూజల్లో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : స్థానిక గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఆలయ ప్రాంగణంలో శ్రీ సత్యదేవుని వ్రతం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి మూలమూర్తులకు విశేష అభిషేకాలు, పూలు, ఆభరణాలతో విశేష అలంకారం నిర్వహించారు. అనంతరం భక్తులచే ఆలయ ప్రాంగణంలో శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరింపజేశారు. అర్చకులు వ్రత విధానాన్ని తెలుపుతుండగా భక్తులు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు వ్రతం ద్వారా లభించేపుణ్యం గురించిన కథలను వివరించారు. కార్యక్రమానికి నగర, స్థానిక ప్రముఖులు,మహిళలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణా రెడ్డి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు బాగా చదువుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి సూచించారు. బుధవారం కడప యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటి డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది యువత మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరు తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉంటారని కలలుగంటారని, వారి కలలను కల్లలుగా చేయవద్దన్నారు. సమాజాన్ని కాపాడాల్సిన యువత బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాగమునెమ్మా... దీవించవమ్మా..

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీహరి రావువీధి నాగరాజుపేటలో గల శ్రీ నాగ మునెమ్మ, నాగర్పమ్మ దేవస్థానంలో బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు అమ్మవారికి విశేష అలంకారం నిర్వహించి భక్తుల దర్శనాలకు అనుమతించారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాష, నగర మేయర్ సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నేతలు సుబాన్‌బాష, ఐస్‌క్రీమ్ రవిలు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. కడప నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. స్థానిక భక్తులతోపాటు నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజల్లో కార్పొరేటర్లు రెడ్డి ప్రసాద్, షఫీ, రామకృష్ణారెడ్డి, పార్టీ నేతలు తోట కృష్ణ, దాసరి శివ ప్రసాద్‌తోపాటు ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో నగర మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాష



అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు

సృజనాత్మక ఆలోచనలతోనే అభివృద్ధి



ఆర్కిటెక్చర్ విద్యార్థులతో ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ఎస్ఎస్ మూర్తి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులకు సృజనాత్మక, నూతన ఆలోచనలు ఉంటే ఆర్కిటెక్చర్ రంగంలో అభివృద్ధి సాధ్యం అని విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ఎస్ఎస్ మూర్తి అన్నారు. బుధవారం డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ అకౌస్టిక్స్ అండ్ లైటింగ్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భవన నిర్మాణంలో శబ్ద నియంత్రణ, కాంతి వినియోగంపై వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ విభాగ అధ్యాపకులు సమీర్, విజయ్‌నాయుడు, అవినాష్‌రెడ్డి, ఈశ్వర రావు, డాక్టర్ ఫణీంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ స్కూళ్లపై కక్ష సాధింపు తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉర్దూ స్కూళ్లపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండడం తగదని ఆప్ కి ఆవాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ షాజహాన్, సయ్యద్ చాన్ బాష తెలియజేశారు. బుధవారం ఆప్ కి ఆవాజ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1390 ఉర్దూ పాఠశాలలు మూతపడే అవకాశం ఉందని.. ఇది ఎంత మాత్రం తగదన్నారు. విద్యా చట్టం ప్రకారం ఉర్దూ స్కూళ్లలో పిల్లలు తక్కువగా ఉన్నప్పటికీ కూడా ఆ స్కూళ్లను కొనసాగించాలని జీవో ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విలీనం పేరుతో తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ జిల్లా కార్యదర్శి మహబూబ్ సాహెబ్ పాల్గొన్నారు.

రక్తదానం



కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరంలోని ఆర్టీసీ ఏరియా ఆస్పత్రిలో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రిమ్స్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆర్టీసీ అధికారులతోపాటు సిబ్బంది దాదాపు 56 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. డిప్యూటీ సీఎంఈ లక్ష్మిభాస్కర్, ఆర్టీసీ ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, కడప జోన్ కార్గో మేనేజర్ హరి, ఆర్టీసీ పోలీసు అధికారి ముజుబుర్ రెహ్మాన్, వైద్యులు మాదుర్య, ప్రత్యూష, వింధ్య, రేష్మా, దివ్యతేజ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 22 నుంచి 24 వరకు కడపలో నిర్వహించనున్న ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభ జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభలలో ప్రాజెక్టుల తీరు తెన్నులు.. ప్రాజెక్టుల నిర్మాణానికి రావాల్సిన నిధులు.. ముఖ్యంగా రాయలసీమ ప్రాజెక్టుల పురోగతి తదితర అంశాలపై .. బచావత్ ట్రిబ్యునల్ , బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అంశాలను చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట శివ, చంద్రశేఖర్, వి వీరశేఖర్, సుబ్రమణ్యం, విజయలక్ష్మి వేణుగోపాల్, జి మద్దిలేటి, వెంకట్ రాముడు, మిడతూర్ ప్రసాద్, మనోహర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ఎదుట ధర్నా

కడప ఎడ్యుకేషన్: నూతన జాతీయ విద్యా విధానం 20 – 20 లో భాగంగా 3 సంవత్సరాల డిగ్రీని 4 సంవత్సరాలు చేసి అదే కళాశాలలో ఎంఏ హానర్స్ చదవడానికి అనుమతి లేదంటూ యూనివర్సిటీ అధికారులు చెప్పడం విచిత్రంగా ఉందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు అన్నారు. అధ్యాపకులు ఉండి, తరగతి గది ఉండి, యూనివర్సిటీ అధికారులు అనుమతి ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ఇందుకు నిరసనగా బుధవారం కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివశంకర్, చంద్ర, నాగార్జున, సాయి, మధు, సాయిరాం హరిప్రసాద్, కావేరి, స్వర్ణలత, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అమలు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : అన్నదాత సుఖీభవ రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సేవా సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎంవీ రమణ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి ,రైతు స్వరాజ వేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డిలు మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ. 20,000 రైతుల ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రాయలసీమ నడిబొడ్డులో కృష్ణానది ప్రవహిస్తున్నదని, నీటి యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని, సీమ పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరి విడనాడాలని వారు డిమాండ్ చేశారు. దశాబ్దాల తరబడి రాయలసీమ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడంతో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి కరువు రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టాలని కోరారు. నిరసన అనంతరం కలెక్టర్ కార్యాలయం ఏఓ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సేవా సమితి నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సేవా సమితి నాయకులు

ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు సహకరించాలి



మాట్లాడుతున్న కడప ట్రాఫిక్ సీఐ డి.కె జావేద్

కడప అర్బన్: కడప నగరంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కడప ట్రాఫిక్ సీఐ డి.కే. జావేద్ తెలియజేశారు. బుధవారం మధ్యాహ్నం ఆయన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. నగరంలోని వివిధ రద్దీ ప్రదేశాలకు ప్రజలు వెళ్లే ముందు తమ టూవీలర్, ఫోర్ వీలర్ వాహనాలను పార్కింగ్ ప్రదేశాలలోనే పార్కింగ్ చేయాలన్నారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపితే చర్యలు తప్పవన్నారు. వాహనాలను నడిపేటపుడు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. టూవీలర్‌పై వెళ్లేటపుడు హెల్మెట్‌ను, ఫోర్ వీలర్‌లో వెళ్లేటపుడు సీట్‌బెల్ట్‌ను తప్పక ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌లాంటి వాటికి స్వస్తిపలకాలన్నారు. మైనర్లకు టూవీలర్, ఫోర్ వీలర్‌లను తల్లిదండ్రులు ఇవ్వరాద న్నారు. ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేయడం వలన వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇలాంటి సమస్య ప్రధానంగా బిల్టప్ దగ్గరున్న స్కూల్ వద్ద, కోటిరెడ్డి సర్కిల్ వద్ద వున్న జూనియర్ కళాశాల, క్రిస్టియన్‌లేన్‌లోని ఆసుపత్రుల వద్ద, వైవీస్ట్రీట్, ఎస్.ఎఫ్.ఎస్ వీధి, పాలెంపాపయ్యవీధి, మెకానిక్ షాపుల వద్ద, కొన్ని హోటళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య విపరీతంగా వుందన్నారు. కడప నగరంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు నిబంధనలను పాటించని వారికి నోటీసులను ఇస్తామన్నారు. వారి పద్ధతిని మార్చుకోకపోతే కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

అర్చకుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప కల్చరల్ : చిలుకూరి బాలాజీ దేవస్థాన ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడిని ఆంధ్ర ప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ముక్త కంఠంతో ఖండించింది. బుధవారం సంస్థ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసిన నగరానికి చెందిన పలువురు దేవాలయాల అర్చకులు ఈ మేరకు నిరసన తెలిపారు. పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వారణాశి శ్రీధరశర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో దేవాలయాల అర్చకులపై దాడి పరిపాటిగా మారిందని, అందరి శ్రేయస్సు కోరే అర్చక బ్రాహ్మణులపై దాడి పాలకులు, సమాజానికి మంచిది కాదని హితవు పలికారు. అర్చక సమాజానికి స్ఫూర్తి ప్రదాత అయిన రంగరాజన్ లాంటి వారిమీదే దాడి జరిగితే ఇంక సామాన్య అర్చకుల పరిస్థితి ఏమిటన్న భయంతో అర్చకులు, బ్రాహ్మణ సమాజం ఉన్నదని తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షులు బ్రాహ్మణపల్లి చంద్రమౌళి శర్మ మాట్లాడుతూ చట్టం, న్యాయం పట్ల ఎటువంటి గౌరవం లేకుండా నిర్భయంగా వ్యాఖ్యలు చేసిన వీడియోల ఆధారం గా న్యాయ వ్యవస్థ సుమోటోగా స్వీకరించి కఠిన శిక్షలు విధించినప్పుడే ఇటువంటి దురాగతాలు ఆగుతాయన్నారు. ఈ సందర్భంగా వారు నగరంలోని అన్నమాచార్యుల విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించి దాడిని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల రాష్ట్ర నాయకులు, మాజీ కార్పొరేటర్ సురేష్, పిడతల గోపాలకృష్ణ, శశి స్వామి, నరసింహ బట్టర్, పోలి సుధీర్, శ్రీనగర్ రమణ , సుధాకర్, రాజన్న, బీజేపీ నాయకులు బాలకృష్ణ యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర యువ నాయకులు బత్తుల పవన్ , బొమ్మన విజయ్, కల్లూరు విజయానంద రెడ్డి, హిందూ సంఘ నాయకులు నీలకంఠ రెడ్డి, మనోహర్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, అర్చకులు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో కౌలు రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మన రాష్ట్రంలో కౌలు రైతులు అధిక శాతం మంది ఉన్నారన్నారు. కౌలు రైతులకు ఎటువంటి గుర్తింపు లేకపోవడం వలన ప్రభుత్వం నుండి లభించే సాగు సహాయం గాని, పంట నష్ట పరిహారాలు గాని, బ్యాంకు రుణాలు గానీ పొందలేకపోతున్నారన్నారు. ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా వారిని గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ నెల 22, 23, 24 తేదీలలో , ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితిల ఆధ్వర్యంలో జరిగే ప్రాంతీయ ప్రాజెక్టుల మహాసభ ను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు టి. మనోహర్ రెడ్డి, ఎస్. శంకర్ రెడ్డి, చిలుము గారి పెద్ద పుల్లయ్య, వై . వి. సుదర్శన్ రెడ్డి, ఈ. బాల చంద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య

నాడు ఇంటింటికీ రేషన్.. నేడు ఇంటింటికీ మద్యం

కడప కార్పొరేషన్: వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ బియ్యాన్ని, సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేశామని, అదే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తున్నారని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి జయ చంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్ విమర్శించారు. బుధవారం మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తాము అధికారంలోకొస్తే నాణ్యమైన మద్యం అందిస్తామని, మద్యం ధరలను పెంచబోమని పైగా తగ్గిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక మాట తప్పి మద్యం ధరలను పెంచాలని నిర్ణయించడం దారుణమన్నారు. ఊరూరా... వాడ వాడలా మద్యం షాపులను ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం... మద్యాన్ని ప్రతి ఇంటికి డోర్ డెలివరీ చేస్తోందని ధ్వజమెత్తారు. కడప నగరంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తాగునీటి వాటర్ ప్లాంట్లను మూసి వేయిస్తున్నారని, మద్యాన్ని మాత్రం 24 గంటలు సరఫరా చేస్తున్నారన్నారు. పేదలకు ఐదు రూపాయలకే క్యాన్ నీటిని అందించే వాటర్ ప్లాంట్లపై అధికారులను ఉసిగొలిపి మూసి వేయించడం అన్యాయమన్నారు. నగరపాలక అధికారులు ఎమ్మెల్యేకు తొత్తులుగా పనిచేస్తూ ఊడిగం చేస్తున్నారని మండిపడ్డారు. కడప నగరంలో నాలుగు రోజులుగా తాగునీరు రాకపోతే కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తిరుపతిలో లక్ష్మిరెడ్డి అనే మహిళను మోసం చేసిన జనసేన నేత కిరణ్ రాయల్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్‌సీపీ గురించి మాట్లాడితే సినీ నటుడు పృథ్వీకి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జోనల్ అధ్యక్షుడు తోట కృష్ణ, కార్పొరేటర్ షఫీ, జిల్లా కార్యదర్శి మునిశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి

దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వీ.సుందర రామరాజు

కడప ఎడ్యుకేషన్: బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు పెరిగిపోయాయని వాటిని అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివి సుందర్ రామరాజు తెలిపారు. బుధవారం కడపలోని ఐఎంఏ హాలులో అఖిలభారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ మహాసభలకు అరుణ కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పివి సుందర్ రామరాజు, ఆ సమితి జాతీయ కమిటీ సభ్యురాలు డాక్టర్ పి ఎస్ ఆర్ ఎస్ ప్రవళికలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలన్నారు.

16న శ్రీకృష్ణ దేవరాయల జయంతి

కడప కల్చరల్ : ఆంధ్రభోజుడు శ్రీకృష్ణ దేవరాయల జయంతి ఉత్సవాన్ని ఈనెల 16న నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి శివప్రసాద్ తెలిపారు. 16న ఉదయం 9 గంటలకు కృష్ణా సర్కిల్‌లోని శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం వద్ద సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అనంతరం బలిజలందరూ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

వినతి – శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసేందుకు తగిన సౌకర్యం లేదని దాసరి శివప్రసాద్.. నగర మేయర్ సురేష్‌బాబు, కమిషనర్ మనోజ్‌రెడ్డిలకు వివరించారు. ఆరు అడుగులపీఠంపై ఉన్న రాయల విగ్రహానికి పూలమాలలు వేయాలంటే నిచ్చెన సౌకర్యం లేదని, వెంటనే ఆ సౌకర్యం కల్పించాలని వారు వినతిపత్రాన్ని సమర్పించారు. నిచ్చెన ఏర్పాటుకు ప్రస్తుతం వీలు కాకుంటే క్రేన్ ద్వారానైనా పూలమాల అలంకరించే ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట కృష్ణ పాల్గొన్నారు.